క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తెలకపల్లి: మండలంలోని 33 కేవీ లైన్ పనుల కారణంగా ఉదయం 10.30 నుంచి 12 గంటల వరకు గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తునట్లు ఏఈ సంతన్ తేజ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. చిన్నముద్దునూరు, తాళ్లపల్లి, పుల్జాల సబ్‌స్టేషన్ పరిధిల్లో గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. రైతులు, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఓటరు జాబితాపై సమావేశం..

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గురువారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ వెంకటరాములు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓటర్ల ముసాయిదా జాబితా అభ్యంతరాలపై సమావేశం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సమావేశానికి రాజకీయ పార్టీల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు హాజరుకావాలని కోరారు.

వెల్దండ: మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 19న ఓటరు జాబితాపై ఆయా పార్టీల నాయకులకు అవగాహన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కుట్టు శిక్షణా కేంద్రం ప్రారంభం



అమ్రాబాద్: మండలంలోని జంగంరెడ్డిపల్లిలో కోనేరు సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణా కేంద్రాన్ని బుధవారం ఎంపీడీఓ వెంకటయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరిక నిర్మూలన కోసం ప్రభుత్వం అందిస్తున్న పథకాలతో పాటు సంస్థలు అందిస్తున్న సహకారాన్ని కూడా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్వయం ఉపాధితో చెంచులు ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంస్థ కోఆర్డినేటర్ బాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శి రాజారాం తదితరులు ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



అమ్రాబాద్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని సీఐ శంకర్‌నాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన వన మహోత్సవంలో ఆయన పాల్గొని మొక్కలు నాటారు. అనంతరం సీఐ మాట్లాడుతూ కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. మొత్తం 600 మొక్కలు నాటారు. ఎస్‌ఐ రమేష్, హెచ్‌ఎం పాండయ్య ఉన్నారు.

మంత్రి పరామర్శ

పెద్దకొత్తపల్లి: వెన్నచర్ల గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ సోదరుడు బాలగౌడ్ గుండె పోటుతో మృతి చెందాడు. బుధవారం రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు వెన్నచర్ల గ్రామానికి వెళ్లి బాలగౌడ్ మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: పట్టణంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఎదురుగా ఉన్న ఓ ప్రైవేట్ ఆర్‌ఎంపీ వైద్యుడు షమీపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న బుధవారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆస్పత్రికి వచ్చిన మహిళతో వైద్యుడు అసభ్యంగా ప్రవర్తించారని ఆరోపించారు. కలెక్టర్ స్పందించి ఆర్‌ఎంపీపై చర్యలు తీసుకోవాలని కోరారు.

సమష్టిగా ఉంటేనే లక్ష్య సాధన

కల్వకుర్తిరూరల్: సగరులు ఐక్యంగా ఉంటేనే అనుకున్న లక్ష్యాన్ని సాధించగలుగుతామని తెలంగాణ సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ అన్నారు. బుధవారం పట్టణంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సగరులు బీసీ-డీలో ఉండటంతో ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దివంగత ముఖ్యమంత్రి ఎన్టీ.రామారావు హయాంలో జారీ చేసిన జీఓ 166 ప్రకారం సగరులను బీసీ-ఏ గ్రూపులోకి మార్చాలని డిమాండ్ చేశారు. కోకాపేటలో సగరులకు కేటాయించిన స్థలంలో భవన నిర్మాణానికి అప్పటి ప్రభుత్వం రూ. 2 కోట్లు మాత్రమే కేటాయించిందని.. మరో రూ. 10 కోట్లు కేటాయించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని పార్టీలు సగరులకు జనాభా దమాషా ప్రకారం అవకాశం కల్పించాలన్నారు. ఎన్నికల్లో సగరులకు అవకాశం కల్పించేందుకు అందరూ ఏకతాటిపైకి రావాలని కోరారు. వచ్చేనెల 6న జిల్లా సగర సంఘం ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో వివేకానంద, రాజుసాగర్ ఉన్నారు.

సమస్యలతో సతమతం

- ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గదుల కొరత
- విద్యార్థులకు తప్పని తిప్పలు



ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం



శిథిలావస్థకు చేరిన మూత్రశాల

వెల్దండ: ప్రభుత్వ కళాశాలల్లో అన్ని మౌలిక వసతులు కల్పిస్తామని పాలకులు అంటున్నా ఆచరణలో మాత్రం అమలు కావడం లేదు. దీంతో విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సమస్యలు తిష్ట వేశాయి. కళాశాలకు ప్రహరీ, సరిపడ మూత్రశాలలు లేక విద్యార్థుల సతమతం అవుతున్నారు. 2005 సంవత్సరంలో కళాశాల భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. జూనియర్ కళాశాల కోసం 3 ఎకరాల స్థలం కేటాయించారు. కాంట్రాక్టర్లు భవన నిర్మాణ పనులు చేపట్టి పూర్తి చేశారు. సొంత భవనం నిర్మించిన మౌలిక వసతులు కల్పించడంతో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ప్రహరీ లేకపోవడంతో మూగజీవాలు కళాశాల ఆవరణలోకి ప్రవేశిస్తున్నాయని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కళాశాలల్లో 182 మంది విద్యార్థులు..

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మొత్తం 182 మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో 108 మంది బాలికలు, 74 మంది బాలురు ఉన్నారు. కళాశాలకు వచ్చిన విద్యార్థులకు కనీస మౌలిక వసతులు లేక అవస్థలు పడుతున్నారు. 108 మంది బాలికలకు కేవలం నాలుగు మూత్రశాలలు మాత్రమే ఉన్నాయి. బాలురకు మూత్ర శాలలు లేకపోవడంతో ఆరుబయటకు వెళ్తున్నారు. గతంలో నాలుగు మూత్రశాలలు నిర్మించినప్పటికి అవి ఉపయోగంలో లేకుండా పోయింది. విద్యార్థినులు, మహిళ అధ్యాపకులకు ఇబ్బందులు తప్పడం లేదు. మూత్రశాలలను శుభ్రం చేసేందుకు సిబ్బంది లేకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోందని విద్యార్థినులు వాపోయారు.

వేధిస్తున్న గదుల కొరత

ఇంటర్మీడియట్‌లో ఇంగ్లీషు, తెలుగు మీడియంలో విద్యా బోధన కొనసాగుతోంది. విద్యార్థులకు సరిపడ గదులు లేవు. రెండు గ్రూప్‌లకు చెందిన విద్యార్థులకు ఒకే చోట బోధిస్తున్నట్లు అధ్యాపకులు పేర్కొంటున్నారు. రెండు సైన్స్ ల్యాబ్‌లు, స్టోర్‌రూం, స్టాఫ్ రూం లేకపోడంతో ఇబ్బందులు తప్పడంలేదు.

మూత్రశాలలు నిర్మించాలి



సరిపడ మూత్రశాలలు లేక ఇబ్బంది పడుతున్నాం. నీటి వసతి కల్పించాలి. కళాశాలల్లో ఫిజికల్ సైన్స్ లెక్చరర్‌ను నియమించాలి. కళాశాలల్లో తరగతులు ప్రారంభం దాదాపుగా మూడునెలలు గడుస్తున్న పాఠ్యాంశాలు బోధించేవారు లేరు. ఉన్నత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి.

–రాజేశ్వరి, బైపీసీ, రెండో సంవత్సరం, వెల్దండ

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



కళాశాలకు ప్రహరీ లేకపోవడంతో కొందరు ఆక్రమణకు యత్నిస్తున్నారు. వెంటనే ప్రహరీ నిర్మించాలి. కళాశాలల్లో గదుల కొరత ఉన్న మాట వాస్తవమే. ఉన్న గదుల్లోనే సరిపెట్టుకుంటున్నాం. ఖాళీగా ఉన్న పీడీ, ఫిజికల్ సైన్స్ పోస్టులను భర్తీ చేయడానికి కృషి చేస్తున్నాం. పూర్తి నివేదికలను జిల్లా అధికారులకు అందజేశాం.

–గోపాల్‌రావు, ప్రిన్సిపాల్, వెల్దండ

అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించం



అచ్చంపేట రూరల్: దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన గాంధీ కుటుంబంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని మున్సిపల్ చైర్మన్ శ్రీనివాసులు హెచ్చరించారు. రాహుల్‌గాంధీపై బీజేపీ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ బుధవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ప్రధాని నరేంద్రమోడీ దిష్టిబొమ్మను కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ రాహుల్ గాంధీపై అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు రఘురాం, వై. శ్రీనివాసులు, హరిశ్చంద్ర, కపిలవాయి శేఖర్ పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలి

వెల్దండ: ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న డీఏలను ప్రభుత్వ వెంటనే విడుదల చేయాలని ఎస్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్త శ్రీధర్‌రావు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని చౌదర్‌పల్లి, కుప్పగండ్ల, గొల్లోనిపల్లి, మర్రిగుంతతండా, తుమ్మలకుంటతండా, తిమ్మినోనిపల్లి, రాఘయపల్లి, తుంకిబండతండా, పెద్దాపూర్, వెల్దండ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఎస్టీయూ సభ్యత్వ నమోదు చేయించారు. కార్యక్రమంలో మండల ప్రధాన బాధ్యులు వి. రాజు, యాదగిరి, మల్లేష్, అశోక్, పత్యనాయక్, జ్యోతి, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వంట సామగ్రి వితరణ

నాగర్‌కర్నూల్: జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 1989-90వ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు బుధవారం వంట సామాగ్రి వితరణ చేశారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయులకు అందజేశారు. ఎండీ సలీం, రాంప్రసాద్, తిరుపతయ్య, తదితరులు ఉన్నారు.

ఆస్పత్రి పారిశుద్ధ్య కార్మికుల సమ్మె నోటీసు



లింగాల: ఆరు నెలల పెండింగ్ వేతనాలను చెల్లించడంలో నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఈ నెల 19 నుంచి సమ్మెకు దిగుతున్నట్లు బుధవారం లింగాల సీహెచ్‌సీ సూపరింటెండెంట్ శివశంకర్‌కు ఆస్పత్రుల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ పారిశుద్ధ్య కార్మికులు సమ్మె నోటీసు అందజేశారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మారెడు శివశంకర్ మాట్లాడుతూ 7 నెలల వేతన బడ్జెట్ విడుదల విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. వైద్య విధాన పరిషత్ పరిధిలోని జిల్లా, ఏరియా ఆస్పత్రులు, సామాజిక ఆరోగ్య కేంద్రాల పారిశుద్ధ్య కార్మికులు సమ్మెకు వెళ్లక తప్పడం లేదన్నారు. గురువారం హైదరాబాద్‌లోని కోఠి వైద్య విధాన పరిషత్ కమిషనర్ కార్యాలయం ముట్టడిస్తునట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు చిన్నపాగ శ్రీనివాసులు, గొర్ల సత్యం, గద్ద బాలరాజు, భీమసేన, మల్లమ్మ, నిర్మల పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడలు



చారకొండ: మండల కేంద్రంలో జెడ్పీహెచ్‌ఎస్‌లో బుధవారం 68వ స్కూల్ గేమ్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) అండర్14-17 మండల స్థాయి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడలు నిర్వహించారు. జీహెచ్‌ఎం భగవాన్ రెడ్డి, ఎంఈఓ శంకర్ నాయక్, ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్‌లతో కలిసి క్రీడలను ప్రారంభించారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల విద్యార్థులు పోటీలో పాల్గొనట్లు మండల స్థాయిలో విజేతలను డివిజన్ స్థాయిలో పాల్గొటారని ఎంఈఓ శంకర్ నాయక్ తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ వెంకట్‌గౌడ్, మండల నోడల్ అధికారిణి ఝాన్సీరాణి, ఉపాధ్యాయులు, వ్యాయమ ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

గుంతను పూడ్చిన అధికారులు



సాక్షి ఎఫెక్ట్..

తాడూరు: మండల కేంద్రం నుంచి యాదిరెడ్డిపల్లి, ఇంద్రకల్, శిర్సవాడమీదుగా వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డుకు అనుసరించుకొని మండల కేంద్రం సమీపంలో కేబుల్ లైన్‌తోపాటు వైఫైకోసం గుంతను తవ్వి వదిలేశారు. ఈ నెల 15న 'తవ్వారు వదిలేశారు' అనే శీర్షికతో సాక్షి దినపత్రికలో వార్త ప్రచురితం అయ్యింది. దీనికి అధికారులు స్పందించి బుధవారం గుంతను పూడ్చివేశారు. దీంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.

శాకాహారంతోనే ఆరోగ్యం



చారకొండ: శాకాహారంతోనే ఆరోగ్యంగా ఉంటారని పిరమిడ్ మాస్టర్ దామోదర్‌స్వామి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో శాకాహార ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు శాకాహారం తీసుకోవడం ద్వారా నిత్యం ఉత్సాహంగా ఉంటారన్నారు. మాంసాహారానికి దూరంగా ఉండాలని సూచించారు. ధ్యానంతో మానసిక ప్రశాంతత, రుగ్మతలు దరిచేరవన్నారు. కార్యక్రమంలో మాస్టర్లు అనిత, కృష్ణారెడ్డి, ఆంజనేయరెడ్డి, మధుసూదన్ రెడ్డి, రాధాకృష్ణ రెడ్డి తదితరులు ఉన్నారు,

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్లు

సాక్షి, నెట్‌వర్క్: చారకొండ మండల తహసీల్దార్‌గా సునీత బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అదేవిధంగా తాడూరు తహసీల్దార్‌గా కిరణ్మయి బాధ్యతలు చేపట్టారు. ఉప్పునుంతల తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన ప్రమీలకు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

వెల్దండ: మండలంలోని కొట్ర గ్రామానికి చెందిన భూత్కురి కృష్ణయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. బుధవారం బాధిత కుటుంబాన్ని గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు రవీందర్‌రావు పరామర్శించి రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. అదేవిధంగా ఉప్పల చారిటబుల్ ఆధ్వర్యంలో రూ.3 వేలు అందజేశారు.

నిమజ్జనానికి తరలిన గణనాథులు



కొరటికల్‌లో నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథుడు

ఉప్పునుంతల: మండలంలోని గ్రామాల్లో ప్రతిష్ఠించిన గణేశ్ విగ్రహాలను బుధవారం నిమజ్జనానికి తరలించారు. గ్రామాల్లో వినాయకుడి మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. భజనలు, యువకుల డాన్స్‌లు, మహిళల బతుకమ్మ ఆటా పాటలతో సందడిగా గడిపారు. స్థానికంగా ఉన్న చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు. కొందరు మండల సరిహద్దులో ఉన్న డిండి ప్రాజెక్టులో విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు తరలించారు.

ప్రత్యేక పూజలు

తెలకపల్లి: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో 12వ రోజు బుధవారం గణనాథులకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తబృందాలు, యువజన సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక మండపాల్లో కొలువుదీరిన గణనాథులకు నిత్యం పూజారులు, నిర్వాహకులు పూజలు నిర్వహించి స్వామి వారికి నైవేద్యాలు సమర్పించారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడికి సింగిల్ విండో వైస్ చైర్మన్ మామిళ్లపల్లి యాదయ్య కుటుంబ సభ్యులు పూజలు చేసి అన్నదానం చేశారు.

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని కుర్వ వీధిలో ఏర్పాటు చేసిన వినాయకుడి వద్ద అన్నదానం చేశారు. కార్యక్రమంలో భీరయ్య, జానయ్య, నాగరాజు, శంకర్, పరమేశ్, మాజీ ఎంపీటీసీ దండు నర్సింహ, శశికళ, శివశంకర్, ఎల్లయ్య, మహేష్, సరిత, సింగిల్ విండో డైరెక్టర్ చంద్రయ్య, బాగరి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న స్వచ్ఛత హీ సేవ



బలాన్‌పల్లి పాఠశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



లింగాల మండలం అవుసలికుంట పాఠశాలలో విద్యార్థుల మానవహారం

తాడూరు: మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాల ఆవరణలో బుధవారం స్వచ్ఛత హీ సేవ వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ బ్రహ్మచారి మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాసాలు, పెయింటింగ్, మానవహారం తదితర కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పవన్, ఎస్‌ఓ విజయ, కారోబార్ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

లింగాల: మండలంలోని అవుసలికుంటలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక పాఠశాల విద్యార్థులు మానవహారం నిర్వహించారు. విద్యార్థులకు వ్యాస రచన పోటీలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆంజనేయులు, ఎంపీఓ చంద్రశేఖర్, ఏపీఓ ఇమాంఅలీ, పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

కోడేరు: మండలంలోని నర్సాయిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచిన ఊర్మిళ, రాణిలకు పంచాయతీ కార్యదర్శి ప్రదీప్‌కుమార్‌గౌడ్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శివారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన



లింగాల/వెల్దండ: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని లింగాల, కల్వకుర్తి సీడీపీఓలు దమయంతి, భాగ్యలక్ష్మి అన్నారు. బుధవారం లింగాల మండలంలోని అప్పాయపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో, వెల్దండ సెక్టార్ పరిధిలో రైతువేదికలో పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. పిల్లలు, బాలింతలు, గర్భిణులు తీసుకోవాల్సిన ఆహారంపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, గిరిజ, శ్రీమతి, పద్మావతి, ఆయా కేంద్రాల టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

నిందితులపై చర్యలు తీసుకోవాలి

తాడూరు: డప్పులు కొట్టడం లేదని కులబహిష్కరణ చేసినవారిపై చర్యలు తీసుకోవాలంటూ బుధవారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కిరణ్మయికి వినతిపత్రం అందజేశారు. మెదక్ జిల్లా, మనోహరబాద్, గౌతాజ్‌గూడలో డప్పులు కొట్టలేదని దళిత కుటుంబాన్ని గ్రామ బహిష్కరణ చేసినవారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు బాలస్వామి, బాలయ్య, కురుమయ్య, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

సబ్ స్టేషన్ వెనుక అగ్ని ప్రమాదం

నాగర్‌కర్నూల్ క్రైం: ప్రమాదవశాత్తు సబ్‌స్టేషన్ వెనుక అగ్నిప్రమాదం బుధవారం చోటుచేసుకుంది. ఫైర్ ఆఫీసర్ కష్టమూర్తి తెలిపిన వివరాల ప్రకారం జిల్లా కేంద్రంలో విద్యుత్ సబ్‌స్టేషన్ వెనుక ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతు చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం జరిగింది. అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం ఇవ్వగా వారు ఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు.

పేకాటస్థావరంపై పోలీసుల దాడులు

కొల్లాపూర్ రూరల్: మండలంలోని అంకిరావుపల్లి గ్రామానికి చెందిన ఏడు మంది గ్రామ సమీపంలో ప్రధాన రహదారి పక్కల కొందరు పేకాట ఆడుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు బుధవారం ఆకస్మిక దాడులు చేశారు. ఏడుగురిని పట్టుకొని పోలీసుస్టేషన్‌కు తరలించారు. వారి నుంచి రూ. 11120 లు స్వాధీనం చేసుకునట్లు ఎస్‌ఐ హృషికేష్ తెలిపారు. సొంత పూచీకత్తుపై విడుదల చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

మిలాద్ - ఉన్ - నబీ వేడుకలు

చారకొండ: మండలంలోని జూపల్లిలో మిలాద్ ఉన్ నబీని పురస్కరించుకొని బుధవారం ముస్లింలు ప్రత్యేక పార్థనలు చేశారు. అనంతరం గ్రామంలో యువకులు ర్యాలీ నిర్వహించారు. మత పెద్దలు ప్రవక్త సందేశాన్ని వినిపించారు. సిరాజ్, షబ్బీర్, అక్రమ్, రియాజ్, ఖలీద్, అజీం, సమీర్, గౌస్, ఇర్ఫాన్, ఇమ్రాన్, సోహేల్, ఆజీం ఉన్నారు.

కఠినంగా శిక్షించాలి

మన్ననూర్: బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని అమ్రాబాద్ మండలం, మన్ననూర్ గ్రామం అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు ఎల్లస్వామి, యశ్వంత్ ఓ సంయుక్త ప్రకటనలో డిమాండ్ చేశారు. మెదక్ జిల్లా కొంతాన్‌పల్లిలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడం హేయనీయమన్నారు.

టాస్క్‌కు రాఘవేందర్‌రెడ్డి నియామకం

వెల్దండ: మండలంలోని చౌదర్‌పల్లి గ్రామానికి చెందిన ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డిని టాస్క్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్‌గా నియమిస్తూ బుధవారం సీఈఓ శ్రీకాంత్‌సిన్హా నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం తనపై నమ్మకం ఉంచి తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్(టాస్క్) పోస్టుకు నియమించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ఐక్యతా ఫౌండేషన్ సభ్యులు సుంకిరెడ్డి కృష్ణారెడ్డి, సురేష్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి

చారకొండ: రోడ్డుకు మరమ్మతు చేయించాలని కోరుతూ బుధవారం మండలంలోని జేపల్లి పంచాయతీ పరిధిలోని నెమలిగుట్ట తండావాసులు ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. జూపల్లి నుంచి నెమలిగుట్ట తండా వరకు నిలిచిన బీటీ రోడ్డు పనులు పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు పవన్‌నాయక్, గోపాల్, కిషన్ తదితరులు ఉన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు వేయాలి



వంగూరు: బాలబాలికలకు వ్యాధి నిరోధక టీకాలను తప్పనిసరిగా వేయించాలని జిల్లా టీకాల అధికారి డాక్టర్ కే.రవికుమార్ నాయక్ అన్నారు. బుధవారం మండలంలోని కొండారెడ్డిపల్లిలో సార్వత్రిక వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న వంద శాతం ఉచిత నిరోధక టీకాలను చిన్నారులకు వేయాలని ఆయన వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శ్రీనివాస్, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం



మన్ననూర్: కాకతీయుల కాలం నాటి వేణుగోపాల స్వామి ఆలయం అభివృద్ధికి గ్రామానికి చెందిన మల్‌రెడ్డి గోపాల్‌రెడ్డి లక్ష్మమ్మ దంపతులు, అచ్చంపేటకు చెందిన విష్ణు శర్మలు రూ.22,500లు వితరణ చేశారు. బుధవారం ఆలయ నిర్వాహకులు రుక్మిణి మహిళా సంఘం సభ్యులు దీపిక, సంబు శోభ, జయమ్మ, సరస్వతి, ప్రభావతమ్మలకు ఆలయం ప్రాంగణంలో అందజేశారు. ఆలయంలోకి కోతులు వచ్చి పూజా సామగ్రి, ఇతర వస్తువులు చిందరవందర చేయడంతో కోతులను కట్టడి కోసం ఇనుప జాలీ వేసేందుకు దాతలు ముందుకు రావడం సంతోషకరమని నిర్వాహకులు పేర్కొన్నారు. పూజారి నర్సింహాచారులు, వెంకటరమణ, శేఖర్, దామోదరచారి, జగతయ్య, శ్రీనువాసులు ఉన్నారు.

తాడూరు: మండలంలోని బలాన్‌పల్లిలో సూర్యదేవాలయ పునర్నిర్మాణానికి గ్రామస్తులు నెల రోజుల నుంచి విరాళాల సేకరిస్తున్నారు. మొత్తం ఇప్పటివరకు రూ.50 లక్షలు సేకరించినట్లు మాజీ సర్పంచ్ అశోక్ తెలిపారు. పనులు ప్రారంభం కోసం బుధవారం రూ.11 లక్షలు నిర్మాణదారుడికి అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. మిగతా డబ్బులను విడతవారీగా ఇస్తామని వివరించారు. మొత్తం దేవాలయాన్ని పునర్నిర్మాణానికి రూ.76.50 లక్షలు అవసరం అవుతాయని అంచనా వేసినట్లు దాతలు ముందుకు వచ్చి సహకరించాలని కోరారు.

నల్లమల ఉపాధ్యాయులకు పురస్కారం



అచ్చంపేట రూరల్: వినూత్న బోధన పద్ధతులు, బోధనోపకరణాల తయారీ వినియోగంలో నల్లమల ప్రభుత్వ ఉపాధ్యాయునీయులకు జాతీయ స్థాయి పురస్కారం లభించింది. ఉప్పునుంతల మండలం గువ్వలోనిపల్లి యూపీఎస్‌కు చెందిన చైతన్య, బల్మూర్ మండలం జినుకుంట యూపీఎస్‌కు చెందిన సువర్ణలు గుజరాత్ హేమచంద్రాచార్య జాతీయ పురస్కారాన్ని అందుకున్నారు. గుజరాత్‌కు చెందిన శిక్షా సాగర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పురస్కారాలు అందుకునట్లు ఉపాధ్యాయులు తెలిపారు.